# నీళ్ళు

"వరుసం బాగా కురిసింది, ఇంగవ్వాళ్ళో అందరూ ఏరువాకసేజ్యాలకు ఎల్లబార్తారు గావాల" అనుకున్నాడు లింగడు. ఎదురుగ్గా పారుతున్న మురిక్కాలువలో కాండ్రించి ఉమ్మేసి, బీడీ తాగుతూ ఆకాశంకేసి పారజూసినాడు. బూడిదరంగులో వున్న మేఘాలు వుల్లాసంగా[1] వురుకులాడుతున్నాయి. ఇంగా సన్నతుంపర రాల్తాంది. రోడ్డుమీద సితసితగా స్త్రీద్రంగ్గా[2] వుంది. అయినా జనం తిరుగుతూనే వున్నారు. పంచెలూ, ప్యాంట్లూ, అప్పుడప్పుడూ రంగురంగుల చీరెలూ కొంచెంగా పైకెత్తుకున్నపాదాలు చెప్పుల్తో, బూట్లతో, నడుస్తూ పోతున్నాయి.

సన్నతుంపర రాల్తాండడంతో లింగడు కప్పుకున్న బట్టతడిసింది. కొట్టం కొప్పునుంచీ వాసాలమీదుగా జారినట్టు, తలమీది నుంచీ వెంట్రుకల పాయలమీదుగా చుక్కలుగా జారుతోంది సన్నవాన. సన్నవానకు తోడు ఠొజ్జగాల్లి అప్పుడప్పుడూ వూపులూపులుగా జల్లుమని కొడుతోంది. గోనెపట్ట పైన కట్టుకుందా మంటే నిన్న మునెయ్యతీసుకుని పోయినాడు. మునెయ్యకు పండుకునేందుకు యేరే తావుంది. గంగయ్యకూ, రాముడిక్కూడా వున్నాయి. అందరివీ తావులేకానీ ఇండ్లుకావు. మునెయ్య, గంగయ్యల పెండ్లాంపిల్లలూ వోటళ్ళ[3] కాడా, అక్కడక్కడా సెంటర్లకాడా అడుక్కుంటారు. "పెండ్లాంపిల్లల్ని అడుక్కోమనడానికి సిగ్గులేదంట్రా!" అని తిడతాడు రాముడు. "నీకేంరా వొంటిగాడివి, వొంట్లో శకితున్నవాడివి. రోజంతా య్యాడకూకుని సచ్చినా రొండ్రూపాయల్రావు. అన్ని కడుపులకేడతేవాలమల్ల?" అంటారువాళ్ళు "ఇయాలింగా యెవురూ రాలేదేంది?" అనుకుని, "వరుసంలో యేమంతసావు" అనుకున్నారేమో...... అని జవాబు చెప్పుకున్నాడు లింగడు.

వాళ్ళ పెండ్లాం పిల్లలు అడుక్కుతెచ్చిన దాంట్లోనే వాళ్ళూ పిడికెడుతిని యా గోడకిందనో తిని యాగోడకిందనో ముడ్సుకుని పండుకునుంటారు. ఇట్టాటప్పుడు గిరాకీ

---

1. కులాసాగా. 2. అసహ్యంగా 3. హోటళ్ళకాడ

వుంటాదని రాముడు రిచ్చా యేస్తాడు. తనకు రిచ్చా తొక్కే బలంలేదు. అడుక్కోనూ లేడు.

బీడీ తుంటని కాల్వలో పారేసి, ఎదురుగా వున్న హోటల్ దిక్కుచూసినాడు. లోపలికి పోయేవాళ్ళు, వచ్చేవాళ్ళు, తింటూ అద్దాలగుండా అగుపించేవాళ్ళు 'శానాసందడి' గా వుంది. "పరగడుపున బీడీతాగే తలికి దీనెమ్మ, కడుపులో బాదలేసినట్టుంది" అనుకున్నాడు. తనకడుపులో వున్నది ఏబాధో గమనించనట్టు, పరగడుపున బీడీ తాగితే వచ్చినట్టు అనుకున్నాడు లింగడు. మరి, పరగడుపున బీడీ తాగడమెందుకు? ఎందుకంటే ఎట్టా? బీడీ కూడా తాగకుండా ఎట్టుంటాడు, అదీ అంచున[1] వున్నెప్పుడు? లింగడు మళ్ళీ రోడ్డు మీదనడిచే పాదాలను చూస్తున్నాడు. చెప్పులుకుట్టే లింగడికి మనుసులమొఖాలను చూడ్డంకంటే, పాదాలను చూడ్డం ఎక్కువ అలవాటయింది. ఎర్రగా, బొద్దుగా, నెత్తురు తొణికిసలాడే మిసమిసల్తో వుండే పాదాలంటే అంత ఇష్టంగా వుండదు లింగడికి. అట్టాంటి పాదాలను జూసినప్పుడల్లా నలికిరిని జూసినట్టుంటాది. వొళ్ళు గగుర్పొడుస్తాది. రక్త పింజర్లను సూసినట్టు రోంతభయమూ కలుగుతుంది. రాళ్ళూ మట్టీ కొట్టుకుని, గాయాలు మచ్చలై, చిత్తడి నేలల్లో నడిచి చివికి, కరుకు నేలల్లో నడిచి చితికి, తాను భైరవుని కోనలో చూసిన భైరవుని పాదాలవంటి పాదాలు కనిపిస్తే...... 'అయి సామిపాదాలు' అని కండ్ల కద్దు కోవాలనిపిస్తుంది. ఆ పాదాలకు తాను కుట్టిన కొత్త చెప్పులను తొడిగిన అనుభవం ఇప్పటికీ ముసలి వొళ్ళును పులకరింపజేస్తుంది. పట్నం రోడ్లమీద అటువంటి పాదాలు కనిపిస్తే పానం లేసొచ్చినట్టుంటాది. పాత గ్యాపకాలతో కొత్తపల్లె గిర్రున తిరుగుతుంది. 'కొత్తపల్లెకాడ ఏరువాకసేజ్యాలు మొదలైతాయి' అనుకుంటున్నాడు. ఇప్పటికీ ఎవరన్నా "మీదే వూరు?" అనడిగితే "కొత్తపల్లె" అని చెబుతాడు. తన అబ్బబ్బల తరం నుంచీ వున్న వూర్ని వొదిలేసివస్తాడని లింగడెన్నడూ అనుకోలేదు. 'వుండ్డూరొదిల్తే ఎవడూ బతకలేడు' అన్నదే తనువినిందీ, అనుకున్నదీ. అట్టాటిది ఇప్పుడు వుండూర్నితనొదిల్నాడో, తనను వుండూరొదిలిందో తెలడం[2] లేదు. వూర్నొదిలి ఎట్టొచ్చినాడు? ఆరె, సిన్నరంపె, గూటమూ తోలుసంచిలో ఏసుకున్నాడు, మెల్లిగా వూరుదాటినాడు. పొలిమేరదాటే దాకా తనువూర్నివొదిలేసివస్తున్నట్టు తనకే నమ్మకం లేదు. ఎదురుపడిన వాళ్ళు కూడా "యాడికి పోతాండావు?" అని అడగలేదు. తనువూరొదిలిపోతున్నట్టు వాళ్ళకు తెల్దు.

మనుసు లెవరికీ తెల్దుకానీ, తను సిన్నప్పుడు సెంగల్రెడ్డిగా రింట్లో జీతానికుండి పసులమేపుకోనూ, ప్యాడకళ్లకోసమూ తిరిగిన తుమ్మలబీడూ, వొయిసోడె సేజ్జెంజేసిన

1. దగ్గర 2. తెలియడం లేదు

సేలూ తనూరు వొదిలిపోతున్నసంగతి కనుక్కున్నట్టే కనిపించినాయి. "లింగా, ఇంగరావా?" అనడుగుతున్నట్టే కనిపించినాయి. ఆసేలన్నీ రెడ్లయే, తుమ్మలబీడూ (బీడంటే ఎప్పుడో బీడు, ఇప్పుడదీ సేనే) రెడ్లయే. అయితేంది? ఆసేలమొకం రెడ్లు సూసిందీ తక్కువే, రెడ్లమొకం సేలు సూసిందీ తక్కువే! తను దాంట్లల్లో సేజ్జెంజేసినాడు. సీకటి సీకటి ఇచ్చేజామునా, ముసిరేజామునా తిరిగినాడు. అందుకే తనుముసిలోడైనా, అయిగుర్తుపట్నాయి.

ఆ సేలన్నిట్లో సేజ్జెంజేసిన తనుపూరొదిలి వచ్చినాడు. ఎన్నడూ సేజ్జెంజెయ్యనివాళ్ళు మేడలు మిద్దెల్తో అక్కడే వుండిపోయినారు! వాళ్ళకు మేడలు మిద్దెలుంటే వున్నీలే....... తమ వాళ్ళు బతికైనా వుండాలా, లేదా? ఏరీ? ఒకప్పుడు కొత్తపల్లెలో తమవాళ్ళవి ముప్పయిఇండ్లుండేటివి. ఇప్పుడుమూన్నాలుగున్నాయి. వాళ్ళా యాడికీ పోలేక వున్నోళ్ళే. మళ్లా వూరు పెరిగింది. ఒకటికి నాలుగిండ్లయినాయి, అందరికీ అన్నీ అమిర్నాయి. తమవాళ్ళేనాశనమైనారు. రెడ్లు "మాదేరా కాలం" అంటుంటారు. కాలం ఎవరిదయింది, రాజ్జెం ఎవరిదయిందీ కనపడుతున్నా అటువంటి మాటలనకుండా వుండరు.

★ ★ ★

ఎదురుగ్గా వున్న హోటల్లో కుర్చీలు దొరక్క కూచున్నవాళ్ళు లేచేదాకా కొంతమంది నిల్చొనివున్నారు. కొత్తలో.......... కొత్త పల్లెతప్ప ఇంకేవూరూ తెలీని లింగడికి ఆ జనాన్ని చూస్తుంటే తమాషాగా వుండేది. వాళ్ళంతా వేరే వూళ్ళ నుంచీ వచ్చిన వాళ్ళేమో అనుకున్నాడు. "అబ్బీ! వాళ్ళంతా పలాత్తలం[1] వాళ్ళా?" అని రామున్ని అడిగినాడు. ఎందుకట్టా అడుగుతున్నాడో రాముడికి అర్థం కాలేదు. "ఈ వూరోళ్ళే అయితే, ఇండ్లల్ల తినొచ్చుగదా........" అనే సరికి అర్థమై పడిపడీ నవ్వినాడు. పక్కనున్న వాళ్ళందరికీ చెప్పినాడు.

"ఒరెర్రిముసిలోడా! ఆకలేసిపొయ్యేవాళ్ళతోనే అయితే ఆ హోటల్ వాడు లక్షలెట్లా సంపాదిస్తాడు? అంతలాడ్జి ఎట్లా కట్టాడు? ఆ పొయ్యేవాళ్ళలో అవసరముండి పొయ్యే వాళ్ళు పదిమందైతే, అవసరం లేకనే పోయేవాళ్ళు తొంబైమందిరా నాయినా"

"అట్టనా?" అన్నాడు ఆశ్చర్యంగా.

రాముడు తనకంటే ఎంతోసిన్నోడు. అయినా తనకంటే 'శానాతెల్సినోడు'. మంచోడు కూడా. అయితే కొంచెం నోటి దుర్సు మనిషి. రాముడితో తిట్లుతినే వాళ్ళే ఎక్కువ, తిననోళ్ళు తక్కువ. ఒకోసారి ఎందుకో ఎవర్నో దగ్గర లేనోళ్ళను కూడా తిడుతుంటాడు. 'అట్టా తిట్టకపోతే రామునంత మంచోడు లేడు' అనుకుంటాడు లింగడు

---

1. పరస్థలం

"ఎందుకురా అబ్బీ! అందర్నీ అట్టా తిడ్తావు?" అనడిగితే,

"అందర్నీ ఎందుకు తిడ్తాను?" అని, "నిన్నుతిట్నానా?" అనడిగినాడు.

"నన్ను తిట్లేదులే, శానామందిని తిడ్తాంటావు గదా...."

"శానామంది ఎట్టాంటి వాళ్ళో నీకు తెలుసునా?"

"ఎట్టాంటి వాళ్ళయితే మనకెందుకు? ఎవురికత వాళ్ళది"

"ఎవురికత వాళ్ళది అనుకోనుంటే నువ్వీడకూకోనుందువా? అంతకు ముందుమునెయ్యా గంగయ్యా కూచునే వాళ్ళా?"

నిజమే. బండ్లోళ్ళు యీ గోడసాట్నుంచీ తరిమెయ్యాలని ఇప్పటికీ సూస్తానే వుండారు. అంతెందుకు? ముందు మునెయ్యా గంగయ్యే తననుకూచోనీ లేదు. అప్పుడీ రాముడే అడ్డుకున్నాడు.

"అడుక్కునే నాయాళ్ళకు అయ్యే బుద్దులు! కట్టంజేసి బతికే వాళ్ళకు అట్టాటి వుండవు. రా....... పెద్దాయనా రా, కూకో! ఏంజేస్తారో సూస్తాను" అనే సరికి ఇద్దరూ నోరుమూసుకున్నారు.

అప్పుడే కాదు రాముడు ఎప్పుడూ సాయం సేస్తానే వుండాడు. సాయం సేయడమ్మూ మానుకోడు, తిట్టడమూమానుకోడు. ఉంగటమో, వారో తెగినవాళ్ళు సెప్పుయీడ్సుకుంటూనో, సేత బట్టుకోనో వస్తారు. దాన్నందుకుని బాగుసేసి ఇస్తే, కాలికేసుకుని "అయిదుకు సిల్లరుందా?" అంటారు. అయిదుకు తనగ్గర సిల్లరెక్కడుంటాది? 'లేదులే......... సామీ' అంటాడు.

ఒకసారి రాముడు చూసినాడు.

"ఇన్నేండ్లొచ్చినాయి, ఎందుకు ఎర్రిసాకొడుక్కు"

"ఏమబ్బీ?"అనడిగితే "దొంగనాకొడుకులు......."అంటూ సెప్పినాడు. తనకిచ్చే ఇరవై పైసాలకోసం పెద్దోళ్ళు అబద్ధం సెప్తారా? 'పెద్దోళ్ళంటే రాముడిక్కోపంలే' అనుకున్నాడు. ఇంగోసారి ఒకాయన "సిల్లరుందా?" అన్నప్పుడు "నాదగ్గరుందిలే, ఎంతగావాల" అనడిగినాడు రాముడు. ఆయన ముఖం చిట్లిచ్చుకుని, మళ్ళా జేబుతడుముకుని ........

"ఆ..... వుందిలే" అని రెండు పదిపైసల బిళ్ళలు పారేసి పొయినాడు. "సూసినావా?" అని కండ్లెగరేసినాడు రాముడు.

"పది రూపాయలకు సిల్లర తెచ్చిస్తాను. వుంచుకో. 'సిల్లరుందా' అనడిగిననా కొడుక్కు మొకాన కొట్టు. అయిదుపైసాలు కూడా వొదలొద్దు. హోటళ్ళలో. లాడ్జిలలో సిల్లర వొదిలే సొచ్చి. వాళ్ళకాలి సెప్పుకుట్టి నోడికాడసిల్లర అడుగుతారు సిల్లర నాకొడుకులు"

ఎవరన్నా పేరు అడిగినప్పుడు "లింగడు" అని సెప్పినా తిట్నాడు. "లింగయ్య అనిసెప్పు. లింగడేంది?" అన్నాడు. కొత్త పల్లెకాడ సిన్న సిన్నపిల్లోళ్ళుకూడా తనను 'ఒరేలింగా' అనే పిలుస్తారు. కొత్తవూరు కొచ్చినా నని ఇప్పుడు 'లింగయ్య' అని సెప్పుకోవాలంటే ఎట్టనో వుండాది.

ఆకాశంలో అంతవరకూ తెల్లగా. బూడిద రంగుతో వున్న మోడాలు(1) మళ్ళీ నల్లగా చిక్కబడుతున్నాయి. "దీనెమ్మ వాన. ఇది ఇడ్సేట్టులేదే" అనుకున్నాడు లింగడు. ఈ వాన ఇట్టనే కురుస్తావుంటే యీదుల్లో మనసు లెవరూ తిరగరు. తన పనిఖాళీ. కడుపుఖాళీ. ఎదురుగా హోటల్ ముందు బోర్డు పెట్టినారు. ఆ బోర్డు పెడితే, అన్నం తయారుగా వున్నట్టని తెలుసుకున్నాడు లింగడు. అన్నం తయారుగా వుంది. తినడానికి మనుషులు కూడా తయారుగా వున్నారు. కొందరు తిని కిల్లీలు నములుకుంటూ నస్తున్నారు. పొద్దున్నుంచీ హోటల్లోంచివచ్చిన వాసనలు మారి, ఇప్పుడు అన్నం, సాంబారు, కూరల వాసనలువస్తున్నాయి. తడిగాలి మీదుగా వాసనలు ఇంకా ఘాటుగా వస్తున్నాయి. "పరగడుపున బీడీతాగేతలికి కడుపులో బాదలేసినట్టుంది" అని ఇంతకుముందు అనుకున్న లింగడు. మళ్ళా బీడీకోసం వెతుక్కున్నాడు. ఈ సారి బీడీకూడా లేదు. పరగడుపేవుంది. మోకాళ్ళ చుట్టూ చేతులు బిగించుకుని కూచున్నాడు. కడుపునట్టాబిగిస్తే కడుపులో ఆకలి తెలకుండా వుంటుందని. లింగడు తన పెద్దోళ్ళ నుంచీ తెలుసుకున్నాడు.

వాన మళ్ళా పెరిగింది. వాన పెరిగే కొద్దీ హోటల్లోకి పోయే వాళ్ళు పెరుగుతున్నారు. రోడ్డు పట్టని వాననీళ్ళు మురిక్కాల్వల్లోకి దూకుతున్నాయి. మురిక్కాల్వ కదిలి చెడ్డవాసనొస్తోంది. కాల్వ కవతలినుంచీ హోటల్ వాసనావస్తోంది.

*(1977 సెప్టెంబర్ 'ప్రజాతంత్ర' లో ప్రచురితం)*

---

(1) మేఘాలు

# -- కథ గురించి. . .

ఈ కథలో చెప్పిన 'భైరవుని పాదాలు' చిన్నప్పుడు మావూరి దేవాలయంలో నేను చూస్తూవుండినవి. నిలువెత్తు రాతిమీద, చెప్పుల్లేకుండా, ఇంతింత లావాటి వ్రేళ్ళతో, మోటువిగా, బలమైనవిగా మలచిన పాదాలు అవి. వాటిని భైరవుని పాదాలు అని చెప్పే వాళ్ళు పెద్దవాళ్ళు. కానీ అవి ఒక శ్రామికుడి పాదాలు అయివుండవచ్చుని, కొంచెం పెద్దవాన్నయిన తర్వాత అనుకున్నాను. ఆ పాదాలను ఈ కథలో పాత్ర ద్వారా జ్ఞాపకానికి తెచ్చుకున్నాను.

కథాంశం గురించి వివరించవలసిన అవసరం లేదు. గ్రామాల్లో వృత్తులు దెబ్బతిని, పట్టణాలకు పొట్టచేత పట్టుకుని నిస్సహాయంగా నిరాధారంగా వెళ్ళవలసిన పరిస్థితిని సూచించేది. రాయలసీమరచయితలు ఏదో ఒక సందర్భంలో నైనా నీటి సమస్యను గురించి చెప్పకుండా వుండలేరు. అయితే. ఈ 'నీళ్ళు' కథ అటువంటిది కాదు. కొందరి వద్ద చేరుతున్న మిగులు డబ్బు ఎటువంటి పెట్టుబడులలోకి వెళ్ళుతున్నదీ, అందువల్ల ఎందరి ప్రాథమికావసరాలు తీరకుండా వున్నదీ, తెలియజేసేది. ఈ ఆర్థికాంశాన్ని అప్పుడు నేను ప్రధానంగా చెప్పాలని చెప్పానా, యాదృచ్ఛికంగా జరిగిందా అనేది చెప్పలేను కానీ, ఆ అంశాన్ని 20 ఏళ్ళ కిందటే సూచించ గలిగినందుకు కొంచెం సంతృప్తి పడుతున్నాను.